

ఖమ్మం రూరల్ మండలంలో అలుముకున్న దట్టమైన మేఘాలు

# మిచౌంగ్ దడ

- ఉమ్మడి జిల్లాను వణికిస్తున్న తుపాన్
- చేతికొచ్చిన మిర్చి, పత్తి, వరికి ముప్పు
- రైతులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరికలు
- పంటలపై టార్పాలిన్లు కప్పాలని, వ్యవసాయ పనులను వాయిదా వేయాలని సూచన



దాచాపురం గ్రామంలో వడ్లు తడవకుండా పట్టాలు కప్పుతున్న రైతు

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ)/ఖమ్మం వ్యవసాయం: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో ఉమ్మడి జిల్లాలో వాతావరణంలో మార్పులు కనిపించాయి. మిచౌంగ్ తుపాన్ ప్రభావం సోమవారం స్పష్టంగా రెండు జిల్లాల్లో స్పష్టంగా కనిపించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు దట్టమైన మేఘాలు అలుముకోవడంతో చీకటి వాతావరణం కనిపించింది. ప్రధాన రహదారులపై వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణం సాగించిన దృశ్యాలు కనిపించాయి. చలి వాతావరణం కొనసాగి కొన్నిచోట్ల చిరుజల్లులు కురిశాయి. ఆకాశం మేఘావృతం కావడంతో నగర వ్యవసాయ మార్కెట్‌కు మిర్చి, పత్తి పంటను తీసుకువచ్చిన రైతులు తొలుత ఆందోళన చెందారు. మధ్యాహ్నంలోపు క్రయవిక్రయాలు, కాంటాల ప్రక్రియ ముగియడంతో ఇటు రైతులు, ఇటు మార్కెట్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. తుపాను మంగళవారం నాటికి ఏపీలోని మచిలీపట్నం- నెల్లూరు మధ్య తీరం దాటే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు, వైరా కృషి విజ్ఞానకేంద్ర శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈలోపు రెండు జిల్లాల్లోనూ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంటుందన్నారు

## రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రస్తుతం రెండు జిల్లాల్లో వరి కోత, మిర్చితీత పనులు జోరుగా సాగుతున్నాయి. తుపాన్ కారణంగా చెదరు మదురు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. గంటకు 40-50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందంటున్నారు. తుపాన్ భయంతో రైతులు ఇప్పటికే కల్లాల్లో ధాన్యంపై పట్టాలు కప్పి ఉంచారు. రైతులు వ్యవసాయానికి సంబంధించిన అన్ని పనులను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని సూచించారు. తోటల్లో సేకరించిన మిర్చి పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించి దానిపై టార్పాలిన్లు కప్పాలంటున్నారు. ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో ప్రజలెవరూ చెట్ల కింద నిలబడొద్దన్నారు. జీవాలనూ చెట్ల కింద ఉంచరాదన్నారు.






భద్రాద్రి కొత్తగూడెం: ధాన్యం రాసులపై టార్పాలిన్ కప్పిన రైతులు



మోరంపల్లిబంజర్‌లో ధాన్యం రాశులపై పరదాలు కప్పిన రైతులు



కూసుమంచిలో తుపాన్ ప్రభావంతో..





# కల్యాణం.. వైభోగం
# ఆనంద రాగాల శుభయోగం

- రేపటి నుంచి పెండ్లి ముహూర్తాలు
- ఆరు నెలల పాటు ఇక వెడ్డింగ్ సీజనే..
- పెళ్లి బాజాల నుంచి ఫొటో షూట్ వరకు ఊరూరా సందడే సందడి
- డెకరేషన్, క్యాటరింగ్, వాద్య బృందం, ఫొటో, వీడియోగ్రాఫర్లకు ఫుల్ డిమాండ్



సత్తుపల్లి, డిసెంబర్ 4: పెళ్లంటే నూరేళ్ల పంట. ప్రతి వ్యక్తి జీవితంలో మరుపురాని మధుర ఘట్టం. లైఫ్ పార్ట్‌నర్‌తో కొత్త జీవితానికి నాంది పలికే శుభదినం. మరి ఆ ముచ్చట సాదాసీదాగా జరిగిపోతే ఎలా.. వివాహ వేడుకల్లో ఆనందకరంగా సాగే ప్రతి తంతూ జీవితాంతం మధుర జ్ఞాపకంగా మిగిలిపోవాల్సిందే. కాస్త వెలుగు.. జిలుగులు అద్దాల్సిందే. పెళ్లంటే తాలిబొట్లు, తలంబ్రాలు, పూలదండలు, ఆభరణాలు, వేదమంత్రాలు, సన్నాయిమేళాలు, షడ్రుచుల భోజనాలే కాదు. ఇప్పుడు వెడ్డింగ్‌కు సినిమా షూటింగంత వైభవం వచ్చిందంటే ఆశ్చర్యమేమీ లేదు. ప్రతి తంతు ఇక కళాత్మకంగా మారింది. ఫొటో, వీడియో షూట్లకు అమాంతం ప్రాధాన్యం పెరిగింది. ఈనెల 6వ నుంచి పెండ్లి ముహూర్తాలు ప్రారంభంకానున్నాయి. మే వరకు పెళ్లిళ్ల సీజన్ ఉంటుంది. ఈ నేపథ్యంలో ఫొటో, వీడియో గ్రాఫర్లు, పురోహితులు, కేటరింగ్ నిర్వాహకులు, సన్నాయి మేళ బృందాలకు డిమాండ్ పెరగనున్నది.

## ఎన్నో హంగులు..

- వధూవరుల మంగళస్నానాలకు చేసే డెకరేషనే ప్రస్తుతం చిన్నసైజ్ పెండ్లి వేడుకలను తలపిస్తున్నాయి. పసుపు నీళ్లు వేసేందుకు అందాల జల్లెడ, సప్తవర్ణ శోభితమైన బిందెలు, మహారాజుల వైభవాన్ని గుర్తుకుతెచ్చే కంచుపాత్రలు, వాటిలో పన్నీరు కలిపిన నీళ్లు.. అందులో తేలియాడే రంగు రంగుల పూలు వన్నెలద్దుతున్నాయి.
- బాసికాలు, పెళ్లి కుమారుడికి అలంకరించే మహరాజా తలపాగాలు, సంప్రదాయ టోపీలు, కాళ్లకు తొడిగే పాంకోళ్లు, రోళ్లు, రోకళ్లకు రకరకాల రంగులతో ముస్తాబు, పెళ్లి కుమార్తెకు కొత్త అందాన్ని తెచ్చి అలంకరించే పూలజడలు, ఖరీదైన జాకెట్లు చేతులకు కళాత్మక మెహందీలు, అందమైన మేకప్, పెళ్లికుమార్తెను తీసుకువెళ్లే బుట్ట, గొడుగు.. ఇలా వివాహ వేడుకలో ఎన్నో నూతన ఆకర్షణలు బంధుమిత్రులను కట్టిపడేస్తున్నాయి. శాస్త్ర సమ్మతం కాదా.. అవునా.. అనే విషయాన్ని పక్కన పెడితే వివాహ సమయంలో వధూవరుల మధ్య ఏర్పాటు చేసే తెరను సైతం అందంగా తీర్చిదిద్దుతున్నారు ఈవెంట్ మేనేజర్స్. వాటిపై సీతారాములు లేదా, అలివేలు మంగ సమేత వెంకటేశ్వరస్వామి వంటి చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. వాటిపై దేవతలను లేసు దారాల అల్లికలతో తీర్చిదిద్దుతుండడం విశేషం. వాటి వల్ల వివాహ సమయానికి దైవానుగ్రహం ప్రసరిస్తుందనే భావన కలిగిస్తున్నారు.
- వివాహ సమయంలో వధూవరుల చేతుల్లో పెట్టే కొబ్బరిబొండాలకు ముత్యాలు, పగడాలు, కెంపులతో కొత్త ఆకర్షణలు తీసుకువస్తున్నారు. వేడుకల్లో ఇప్పుడు సంప్రదాయ కర్పూర దండలు కొత్త రూపాల్లో కనువిందు చేస్తున్నాయి.
- తలంబ్రాలకు వాడే కొబ్బరి కురిడీలను సైతం నిర్వాహకులు అద్భుతంగా ముస్తాబు చేస్తున్నారు. ఇక పెళ్లి మండపం ముస్తాబైతే చెప్పనక్కర్లేదు. ఈవెంట్ మేనేజర్స్ మండపం కోసం పూలను హైదరాబాద్, బెంగళూరు నగరాల నుంచి పెద్ద ఎత్తున తెప్పిస్తున్నారు. కళ్లు మిరిమిట్లు గొలిపే లైటింగ్ సమకూరుస్తున్నారు.









## ఫొటోషూట్లకు డిమాండ్ ఉన్నది..



పెళ్లికు మార్తెల ముస్తాబు నుంచి కార్ల డెకరేషన్ వరకు వేడుకల్లో మార్పు వచ్చింది. ఫొటో షూట్లకు గతంలో కంటే డిమాండ్ పెరిగింది. ఇప్పుడు వధూవరుల అలంకరణ పెద్ద ఫ్యాషన్. మంగళ స్నానం, పెళ్లి తంతులకు సినిమా స్టైల్లో ఫొటోషూట్స్ జరుగుతున్నాయి. పెండ్లి కుదిరి శుభలేఖ ప్రింట్ అయినా నాటి నుంచి వివాహ వేడుక ముగిసేవరకు ఫొటో, వీడియోగ్రాఫర్లకు పని దొరుకుతున్నది.

**– మేకా సతీష్‌రెడ్డి, ఫొటోగ్రాఫర్, సత్తుపల్లి**

# గోడౌన్లకు చేరిన ఈవీఎంలు



ఈవీఎంలను భద్రపరిచిన గదికి తాళాలు వేసిన అధికారులు

మామిళ్లగూడెం, డిసెంబర్ 4 : తెలంగాణ రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయింది. దీంతో జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో వినియోగించిన ఈవీఎంలను సోమవారం పటిష్ట భద్రత నడుమ, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నూతన కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోడౌన్‌కు తరలించారు. నియోజకవర్గాల వారీగా వాటిని భద్రపరిచారు. అనంతరం నియోజకవర్గాలకు కేటాయించిన రిజర్వ్ ఈవీఎంలను జిల్లా ప్రజా పరిషత్ ఆవరణలోని ఈవీఎం గోడౌన్‌లోకి భద్రతతో, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తరలించి భద్రపరిచారు. ఈ ప్రక్రియలో జిల్లా అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, సత్తుపల్లి రిటర్నింగ్ అధికారి, కల్లూరు ఆర్డీవో అశోక్ చక్రవర్తి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్ గోపాల్, ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, సీనియర్ అసిస్టెంట్ హుస్సేన్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు గోపాల్‌రావు, ఎండీ.తాజుద్దీన్, షేక్ రబ్బాని, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి శంకర్, బీజేపీ పార్టీ ప్రతినిధి జి.విద్యాసాగర్‌రావు, టీడీపీ పార్టీ ప్రతినిధి కృష్ణ ప్రసాద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వానర సేనకు వన స్వాగతం

- కోతుల భుక్తి కోసం 'రక్షక భట పార్క్'
- సత్తుపల్లిలో తొలిసారిగా ఏర్పాటు
- మూడేళ్ల క్రితం ప్రారంభమవగా చిట్టడవిగా రూపాంతరం
- ఆహ్లాదకరంగా ఠాణా పరిసరాలు

**నరుడైనా.. వానరుడైనా ఆకలి కామన్. మరి అడవుల్లో ఆహారం దొరక్క జనజీవనంలో భాగమవుతున్న వానరాల పరిస్థితి ఏంటి? వాటి ఆకలి ఎలా తీరాలి? అందుకే తెలంగాణ పోలీస్‌శాఖ వినూత్నంగా ఆలోచించింది. 2020లో సత్తుపల్లి పోలీస్‌స్టేషన్ పక్కనే 'వానర వనం' ఏర్పాటు చేసింది. రెండెకరాల విస్తీర్ణంలో 270 రకాల పండ్ల మొక్కలతో ప్రస్తుతం ఈ వనం ఆహ్లాదకరంగా కనిపిస్తున్నది.**

**- సత్తుపల్లి, డిసెంబర్ 4**





మొక్కలు నాటుతున్న పోలీసులు(ఫైల్)

ఒకప్పుడు అది చిట్టడవిని తలపించే రక్షకభట నిలయం. ఎటు చూసినా పిచ్చిమొక్కలతో నిండిన ఆవరణం. అసలే పోలీస్‌స్టేషన్.. ఆపై ఆడవిని తలపిస్తుంటూ అందులోకి వెళ్లాలంటే భయంగానే ఉండేది. అదే పోలీస్‌స్టేషన్, అందులోనే ఏసీపీ కార్యాలయం, సిబ్బంది క్వార్టర్స్. ఎప్పుడో నిర్మించిన ఆ భవనాలు శిథిలావస్థలో ఉండగా.. దాదాపు 8 ఎకరాల స్థలం నిరుపయోగంగా ఉండేది. ఆ పరిసరాలన్నీ పిచ్చిచెట్లతో, గడ్డిమొలిచి విషపూరిత కీటకాలతో ఆవాసంగా మారాయి. నాటి కల్లూరు ఏసీపీ వెంకటేశ్, నాటి సీఐ రమాకాంత్ బాధ్యతలు చేపట్టిన తర్వాత.. ఆ ఖాళీ స్థలానికి మహర్దశ పట్టుకుంది. పిచ్చిమొక్కలు, పొదలను తొలగించి వాలీబాల్, షటిల్ కోర్టులు ఏర్పాటు చేయించారు. యోగా క్లాసులు నిర్వహించేందుకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించారు. వెనక స్థలంలో సింగరేణి సహాయంతో జేసీబీల ద్వారా నేలను చదును చేయించారు. దాదాపు 500 టిప్పర్లకు పైగా వినియోగించి మట్టి తోలకాలు జరిపారు. మొత్తంగా చిట్టడవిగా ఉన్న ఆ ప్రదేశాన్ని అద్దంలా మార్చివేశారు. ఆ స్థలాన్ని ఎలా ఉపయోగించాలన్నా ఆలోచనలోంచి పుట్టిందే ఈ 'వానర వనం' (మంకీస్ ఫుడ్‌కోర్ట్).

## తెలంగాణలో తొలిసారిగా..

నాటి ఖమ్మం పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ ఆదేశాల మేరకు తెలంగాణలోనే తొలిసారిగా పోలీస్‌శాఖ సత్తుపల్లిలో వానర వనం ఏర్పాటు చేసింది. పోలీసులు రెండెకరాల ఖాళీ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయించి, దాదాపు 270 రకాల పండ్ల మొక్కలను నాటించారు. వీరిద్దరూ విధి నిర్వహణలో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ ప్రకృతిపై ప్రేమతో పోలీస్‌స్టేషన్ రూపురేఖలు మార్చారు. వీరి సంకల్పానికి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, సింగరేణి ఉన్నతాధికారుల సహకారం అందించడంతో వానర వనానికి చకచకా పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం వనంలో మొక్కలు ఏపుగా పెరిగి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

## ఆహ్లాదకరంగా పోలీస్‌స్టేషన్...

ఒకప్పుడు పోలీస్‌స్టేషన్‌కు వస్తే ఎటుచూసినా శిథిలమైన వాహనాలు, చెత్తాచెదారంతో నిండి ఉండేది. నేడు ఆ వాహనాలన్నీ ఓ క్రమపద్ధతిలో పేర్చారు. పోలీస్‌స్టేషన్‌లో అడుగుపెట్టగానే ఉద్యానవనాన్ని తలపించేలా ఏపుగా పెరిగిన చెట్లు స్వాగతం పలుకుతున్నాయి. లోనికి ప్రవేశించగానే వివిధ రకాల పండ్లు, పూల మొక్కలతో స్టేషన్ ఆవరణమంతా ఆహ్లాదకరంగా మారిపోయింది.



పండ్ల మొక్కలతో ఆహ్లాదంగా వనం



పచ్చదనంతో నిండిన ఠాణా